Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

# Vyaktitva vikasampai Annammayya Sankirtanala Prabhavam

*J. Udayabhaskar*
*Research Scholar*
*Department of Performing Arts*
*S.V.University, Tirupati, A.P – 517 502*
*e-mail: udaymusic007@gmail.com*

*Abstract*

*Anamayya's sankirtana-s dazzle in poetic excellence and with a chiseled structrue, carryo out outstanding musical element along with strong emotion, enhancing their melodic, aesthetic and rhetorical value. His sankirtana-s helped in eradicating the evil practices prevalent and an antidote for the ills of the society. He understood the ill effects of discrimination on the basis of caste and hence tried to cleanse the society by providing message through the medium of sankirtana-s. Annamayya had the ability to put profound thoughts in simple words.*

*Key words – Sankirtana-s, poetic excellence, aesthetic, discrimination*

## వ్యక్తిత్వ వికాసంపై అన్నమయ్య సంకీర్తనల ప్రభావం

**పరిచయం**

**లలిత కళల ప్రాధాన్యత - వ్యక్తిత్వ వికాసం**

సంచార జీవితం నుంచి నాగరిక సమాజం వైపు అడుగులు వేసిన మానవ పరిణామ క్రమాన్ని నిప్పు, చక్రం , పోడు సేద్యం మలుపు తిప్పింది. శ్రమ నుంచి సేద దీరడానికి మనిషి ఆట, పాటలను సృష్టించుకున్నాడు.

Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

క్రమేపి సంగీత, సాహిత్యాది లలిత కళలను మాధ్యమంగా చేసుకుని భావ వ్యక్తీకరణకు పూనుకున్నాడు. సంజ్ఞలు శబ్దాలుగా, అక్షరాలుగా, అక్షరాలు స్వరాలుగా, రాగాలుగా అవతరించి రస సిద్ధిని కలిగించాయి.

పదాలు, వాక్యాలు, పద్యాలు, గీతాలు, కీర్తనలు, సంకీర్తనలు, కృతులు, జావళీలు, తిల్లానాలుగా స్వరాలు సాహిత్యంతో కలసి కొత్త రూపాన్ని పొదుగుకున్నాయి. కవులు, కళాకారులు, వాగ్గేయకారులు తమ అభిరుచి కి అనుగుణంగా రచనా వ్యాసంగాన్ని ఎంచుకుని తమ ఆలోచనలను సమాజ హితం కోసం ప్రదర్శించడం ప్రారంభించాడు. ఒక్కో యుగంలో ఒక్కో ప్రక్రియ పరిస్థితులకు అనుగుణంగా ఆవిర్భవించింది. అలా ఆవిర్భ వించిన ఒకానొక ప్రక్రియ సంకీర్తన. తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు, ద్రావిడాగమ సార్వభౌముడు, హరిసంకీర్తనాచార్యునిగా బిరుదులను పొందిన శ్రీమాన్ తాళ్లపాక అన్నమా చార్యులు 'సంకీర్తనల' సృష్టికర్తగా తెలుగు సాహిత్య యుగాన్ని మలుపు తిప్పి తనదైన ముద్రను స్థిరీ కరించుకున్నాడు. చిన్న చిన్న పదబంధాలతో సమకాలీన పరిస్థితులను తన సంకీర్తనల ద్వారా ప్రతి బింబింపజేసిన మహావాగ్గేయకారుడు అన్నమయ్య. గ్రాంథిక, శిష్ట వ్యవహారిక, వ్యావహారిక భాషా శైలులలో సంస్కృతాంధ్ర సంకీర్తనలను రచించాడు. జానపదుల జీవద్భాషను వాడి రచనాశైలిలో తరువాతి తరాల వారికి మార్గదర్శకుడైనాడు.

**అన్నమయ్య జీవిత చరిత్ర**

కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వారి మహత్త్వాన్ని, తత్త్వ వైభవాలను 32 వేల ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలుగా రచించి తరించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు శ్రీ తాళ్లపాక అన్నమా చార్యుల వారు. 1408 - 1503 సంవత్సరాలకు చెందిన శ్రీ అన్నమాచార్యులు తన ఎనిదేళ్ల ప్రాయంలోనే శ్రీవేంకటేశ్వరుని దర్శించి జీవిత కాలమంతా స్వామి సేవలో గడిపి, ఒక సంకీర్తన సారస్వత క్షీర సముద్రా న్ని లోకానికందించిన మహనీయుడు. రాగి రేకుల మీద చెక్కబడి, తిరుమల సంకీర్తనా భాండారంలో భద్ర పరచబడిన ఈ సంకీర్తనా నిధిని తొలుతగా 1922వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థాన యాజ మాన్యం కనుగొనడం జరిగింది. ఆనాటి నుంచి ఎందరో మహానుభావుల కృషితో తాళ్లపాక వారి వాఙ్మయం పై నిరంతరం పరిశోధన జరుగుతూనే వుంది. 32వేలలో 14వేల సంకీర్తనలు చెక్కబడిన మూడు వేల రేకులు మాత్రం మనకు లభ్యమైనాయి.

**తాళ్లపాక కవుల పదసాహిత్యం - విశిష్టత**

తెలుగు సాహిత్యచరిత్రలో పద రచన సృష్టికర్త అన్నమయ్య. పదకవితా పితామహుడిగా ప్రబంధ యుగంలో సాహిత్య రచనా గతిని మలుపు తిప్పిన మహాకవి. జన సామాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని సాహిత్యంలో మార్పు తప్పనిసరని భావించిన దీర్ఘదృష్టి.

**సంకీర్తన లక్షణం**

సంకీర్తనా రచన నిత్యనూతనం, వినూత్నం, విశిష్టం. చిన్న చిన్న పదాలతో సులభతరమైన వాక్య నిర్మాణంతో సంకీర్తనల రచనకు శ్రీకారం చుట్టిన మహా వాగ్గేయకారుడు అన్నమయ్య. పల్లవి, చరణాలు సంకీర్తన సామాన్య లక్షణం. అయితే కొన్ని సంకీర్తనల్లో అనుపల్లవి, బహు చరణాలు, అనుబంధ సాహిత్యం కనిపిస్తుంది . అలాగే సంస్కృత సంకీర్తనలు అరుదుగా మనం చూడవచ్చు. అచ్చ తెనుగు నుడికారాలు, సామెతలు, మాండలీక శబ్ధాలతో, ఆనాటి సమాజంలో కనిపించే సంస్కృతి, ఆచార, వ్యవహారాలను ప్రతిబింబించేలా జానపద శబ్ధాలను అర్ధవంతంగా తన సంకీర్తనల్లో జోడించాడు. అన్నమయ్య తరువాత పెద తిరుమలయ్య, చినతిరుమలయ్యలు వారసత్వంగా సంకీర్తనల రచనా వ్యాసంగాన్ని కొనసాగించి జన్మను సార్ధకం చేసుకు న్నారు.

**సంకీర్తనల వర్గీకరణ - ప్రయోజనం**

సాహిత్య విలువల ఆధారంగా సంకీర్తనలను శృంగార, ఆధ్యాత్మ, జానపద, భక్తి, వైరాగ్య సంకీర్తనలుగా విభ జించవచ్చు. ఆత్మ దర్శనమైన దృష్టితో వైష్ణవ సిద్ధాంతాన్ని, శరణాగతిని, దాసభక్తిని తన ఆధ్యాత్మ సంకీర్తనల ద్వారా స్పష్టం చేసాడు అన్నమయ్య. వైష్ణవ తత్వాన్ని ప్రచారం చేయడం కోసం దేశ సంచారం చేసిన అన్నమయ్య జానపదుల్లో భగవతత్త్వం పాదుకొనడం కోసం వారికి అనువైన గేయ రీతుల్లో శ్రీవేంకటేశ్వరుని లీలా వైభవాన్ని సంకీర్తనలుగా రచించాడు. దేశి కవితా ప్రక్రియకు చెందిన తందనానలు, ఛాంగుభళా, సువ్వి, సోబాన వంటి పదాలతో రచనలు చేసాడు. ఉత్సవ నిర్వహణా తంతును వివరించే సందర్భాల్లో పెండ్లి పాటలు, జాజర, గొబ్బి, వసంతాలు, కోలాటాలు, దివ్యనామాలు, దశావతార సంకీర్తనలు వంటి స్పష్టమైన వర్ణనలతో పామరులను అలరించే జానపద గేయ రీతుల్లో మనకు కనిపిస్తాయి. భక్తి ద్వారా సమాజంలోని అన్ని వర్గాలను ప్రభావితం చేయడమే గాక వ్యక్తుల మానసిక స్థితిగతుల్లో మార్పులు తీసుకువచ్చి సమాజ

శాంతి తద్వారా విశ్వమానవ శ్రేయస్సు ప్రధాన లక్ష్యంగా సంకీర్తనా రచనలను చేసిన ఆదర్శమూర్తి అన్నమయ్య.

**సాహిత్య విలువలు**

తన సంకీర్తనల్లో సాహిత్యానికి పెద్ద పీట వేసిన వాగ్గేయకారుడు అన్నమయ్య. పల్లవి బహుచరణాలతో సాగే సంకీర్తనల్లో ఆనాటి పరిస్థితులను ఉదహరిస్తూ రచనలు చేశాడు. ఒక ప్రత్యేకమైన దృక్పథంలో మాత్రమే ఆ సంకీర్తనలలోని రసానుభూతి పొందటం సాధ్యమని భావించాడు. ప్రాధమికంగా అన్నమయ్య - భక్తుడు, భావుకుడు. ఆ తరువాతే గాయక కవి. భాషా నిబంధనలకు అతీతంగా భావ ప్రకటన చేసిన అన్నమయ్య సంగీత విషయంలో కూడా ఎంతో నవ్యత, స్వాతంత్రం ప్రకటించాడు. అన్నమయ్య పదాలలో సంగీతం, సాహిత్యం, భగవద్భక్తి త్రివేణీ సంగమంలా మేళవించాయి. అన్నమయ్య సంకీర్తనలు శ్రీవేంకటేశ్వర ముద్రాంకితాలు.

**అభ్యుదయవాది**

ప్రబంధయుగంలో పద రచనకు పూనుకున్న అన్నమయ్యను అధిక్షేపించిన వారు, అడ్డుకున్న వారు చాలా మంది వున్నట్లు చారిత్రక ఆధారాల ద్వారా అర్థమవుతోంది. ఆ దశలో సంకీర్తనలే ఆయుధంగా ఆనాటి సమాజంలోని అసమానతలపై పోరాటం చేసిన అభ్యుదయవాదిగా అన్నమయ్య మనకు దర్శనమి స్తాడు. ఇందుకు సంబంధించిన అనేక నిదర్శనాలను మనం చూడవచ్చు. నిమ్న కులాల వారిని తిరుమల క్షేత్రంలో స్వామి వారి దర్శనానికి అనుమతించని దశలో పోరాటం చేసి వారికి శ్రీవారి దర్శనాన్ని కల్పించి న అభ్యుదయవాది. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' అనే సంకీర్తనలోని సాహిత్య సారం ఈ అంశాన్ని స్పష్టం చేస్తుంది. దేవుని కృపకు సర్వజనులు సమానమైన అధికారం కలిగివుంటారని అనుభవపూర్వకంగా పరిశీ లించి సంకీర్తనల్లో ఆవిష్కరించాడు అన్నమయ్య.

**పల్లవి**

తందనాన ఆహి తందనాన పురె
తందనాన భళా తందనాన

Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

బ్రహ్మమొకటె పర బ్రహ్మ మొకటె పర

బ్రహ్మమొకటె పర బ్రహ్మమొకటె

**చరణం**

కందువగు హీనాధికము లిందులేవు

అందరికి శ్రీహరే అంతరాత్మ

ఇందులో జంతుకుల మింతా నొకటే

అందరికి శ్రీహరే అంతరాత్మ

**చరణం**

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే

అండనె బంటు నిద్ర అదియు నొకటే

మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమి యొకటే

చండాలుడుండేటి సరి భూమి యొకటె

**చరణం**

కడగి యేనుగు మీద కాయు యెండొకటే

పుడమి శునకము మీద పొలయు నెండొకటే

కడు పుణ్యులను పాప కర్ములను సరిగావ

జడయు శ్రీవేంకటేశ్వరు నామమొకటే

అలాగే సామాన్య మానవుని బలహీనతలను, స్థితిని 'ఎక్కడి మానుష జన్మం' అనే సంకీర్తన ద్వారా చక్కగా వివరించాడు.

**పల్లవి**

ఎక్కడి మానుష జన్మంబెత్తిన ఫలమే మున్నది

నిక్కము నిన్నే నమ్మితి నీ చిత్తంబికను

**చరణం**

మరవను ఆహారంబును మరవను సంసార సుఖము
మరవను యింద్రియ భోగము మాధవ నీ మాయ
మరచెద సుజ్ఞానంబును మరచెద తత్త్వ రహస్యము
మరచెద గురువును దైవము మాధవ నీ మాయ

**చరణం**

విడువను పాపము పుణ్యము విడువను నా దుర్గుణములు
విడువను మిక్కిలి యాసలు విష్ణుడ నీమాయ
విడిచెద షట్కర్మంబులు విడిచెద వైరాగ్యంబును
విడిచెద నాచారాంబును విష్ణుడ నీ మాయ

**చరణం**

తగిలెద బహులంపటముల తగిలెద బహు బంధముల
తగులను మోక్షపు మార్గము తలపున యెంతైనా
అగపడి శ్రీవేంకటేశ్వర అంతర్యామివై
నగి నగి నను నీవేలితి నాకా యీ మాయ

**అన్నమాచార్య ప్రాజెక్టు**

తాళ్లపాక కవుల సంపూర్ణ సాహిత్యాన్ని జన హృదయాంతరాలలో సుప్రతిష్టితం చేసే సత్సంకల్పం తో, సంకీర్తనాచార్యుని పదరచనలకు పట్టం గడుతూ 1978లో టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ను స్థాపించి సంకీర్తనల ప్రచారోద్యమానికి తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీకారం చుట్టింది. ఆంధ్రదేశంలోని వాడవాడలా మాత్రమే కాక రాష్ట్రేతర ప్రాంతాల్లో, విదేశాల్లో సైతం మారు మ్రోగేలా చెయ్యడంలో అన్నమాచార్య ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తోంది. సంకీర్తనల విస్తృత వ్యాప్తికి మూడు ముఖ్య విభాగాల ద్వారా ప్రాజెక్టు ప్రచారాన్ని కొనసాగిస్తున్నది.

Pranav Journal of Fine Arts
(A Peer Reviewed Quarterly Online Journal)
ISSN:2582-9513

**పరిశోధన, ప్రచురణ**

ఇప్పటి వరకు లభ్యమైన 14వేల సంకీర్తనలను ప్రముఖ సాహితీవేత్తల ద్వారా పరిష్కరించి ముద్రించి ప్రచురించడం ప్రధాన లక్ష్యంగా ప్రాజెక్టు కార్యకలాపాలను ప్రారంభించారు. ఇప్పటివరకు తాళ్లపాక పద సాహిత్యం పేరిట 29 సంపుటాలను భక్తజనానికి అందించారు. తాళ్లపాక వారి పద సాహిత్యంపై పరిశోధన చేసే పరిశోధక విద్యార్థులకు ప్రత్యేకంగా ఉపకార వేతనాలనుఅందిస్తున్నారు. పద సాహిత్యంపై జాతీయ సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి ప్రముఖుల అభిప్రాయాలను, పరిశోధక వ్యాసాలను ప్రచురించడం ద్వారా పదసాహిత్యానికి విశేష ప్రచారం కల్పిస్తున్నారు.

**సంగీత కార్యక్రమాల ద్వారా ప్రచారం**

ప్రాజెక్టులో ఎంపిక కాబడిన కళాకారుల ద్వారా సంకీర్తనా కచ్చేరీలు, హరికథలు నిర్వహించడంద్వారా జన బాహుళ్యంలోకి అన్నమాచార్య ప్రాజెక్టు తీసుకువెళుతోంది.

**ఆడియో, వీడియో క్యాసెట్స్, సి.డిల రూపకల్పన**

శాస్త్రీయ నేపథ్యంతో పలువురు విద్వాంసులు స్వరపరచిన సంకీర్తనలను ఎస్వీ రికార్డింగ్ ప్రాజెక్టు ద్వారా రికార్డింగ్ చేసి పలు మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఇటు సాహిత్యపరంగా అటు సంగీత పరంగా అన్నమయ్య సంకీర్తనల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ అవిరళ కృషి చేస్తోంది.

**సంకీర్తనల ప్రచారం- వ్యక్తిత్వ వికాసంపై ప్రభావం**

**సమాజ శాంతి**

అర్థ భావ ప్రధానాలయిన అన్నమయ్య సంకీర్తనలు సమాజంలోని వివిధ వర్గాల వారిపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి. విస్తృత భావగర్భితమయిన అన్నమయ్య పదాలు అటు శాస్త్రీయ పద్ధతిలో ఇటు లలిత జానపద రీతుల్లో భావానుగుణంగా స్వరపరచబడి సర్వ జనాకర్షణగా రాజిల్లుతున్నాయి. వాగ్గేయకారుడు తన పదాల ద్వారా సాధించ దలచుకున్న ఫలితాలను సఫలీకృతమైన రీతిలో సాధించాడని చెప్పడానికి ఎన్నో నిదర్శనాలను మనం చూడవచ్చు. పండిత పామర వర్గాలను సమరీతిలో ఆకట్టుకుని వారి మనోభావాలను ప్రభావితం చేస్తున్నాయి.

**ముగింపు**

**సంకీర్తనల ద్వారా సాధించిన ప్రయోజనం- ప్రగతి**

అర్ధవంతమైన సాహిత్యం,అందుకు అనుగుణమైన సంగీత బాణీలు శ్రోతలను అలరిస్తూ ప్రేరేపితులను చేస్తున్నాయి. సమాజ శాంతిని నెలకొల్పడంలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. వ్యక్తిత్వ వికాస సాధనకు సోపానాలుగా మారాయి. అన్నమయ్య సంకీర్తనలను క్రమం తప్పకుండా వినడం, చదవడం, అర్థాన్ని తెలుసుకోవడం ద్వారా ఎంతో మంది ఆధ్యాత్మిక మార్గం వైపు మళ్లింపబడ్డారు. ఈ అంశంపై శాస్త్రీయ పరమైన సర్వే, పరిశోధన నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా వుంది. మారుమూల ప్రాంతాల్లోని జానపదులు అన్నమయ్య సంకీర్తనలు విని ఎంతో ప్రేరేపితులయ్యారు. ఆ ఉద్దేశ్యంతోనే అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సంకీర్తనా యజ్ఞాలను ఏర్పాటుచేస్తున్నారు. సాహిత్యంలోని విలువలతో పాటు ఆచరణీయంగా ఉండే అనేక జీవిత సత్యాలను ఉభయ తారకంగా అటు భక్తి భావనలను, వ్యక్తిత్వ వికాస చైతన్యాన్ని అన్నమాచార్య సంకీర్తనలు సాధిస్తున్నాయని చెప్పడంలో ఎలాంటి సందేహము లేదు.

**ఉపయుక్తగ్రంథాలు**

1. నెక్టార్ ఓషన్ ఆఫ్ అన్నమాచార్య, అంబిక అనంత్, అద్వితీయ ఎన్. దీక్షిత్,
   తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2005.

2. శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర డా॥ కేసర్ల వాణి,
   తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. 2000.

3. తాళ్ళపాక పదసాహిత్యము -1 నుంచి 29 సంపుటములు
   ఆధ్యాత్మ, శృంగార సంకీర్తనలు, అన్నమాచార్య ప్రాజెక్టు,
   తిరుమల తిరుపతి దేవస్థానములు. 1999.

4. హరికొలువు, జూలకంటి బాలసుబ్రహ్మణ్యం,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. 2004

5. సిరికొలువు, జూలకంటి బాలసుబ్రహ్మణ్యం,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. 2012

6. తిరుపతి చరిత్రము, దీవిరంగనాథాచార్యులు,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి. 2003.